క్లుప్తంగా

సేవలతోనే గుర్తింపు

పాలకొండ: స్థానిక ఆర్టీసీలో 34 సంవత్సరాలు డ్రైవర్‌గా పని చేసి పదవీ విరమణ పొందుతున్న యల్లమహంతి రామకృష్ణ పాత్రోను డ్రైవర్లు ఆదర్శంగా తీసుకోవాలని డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం రామకృష్ణపాత్రోకు సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్నేళ్ల సర్వీసులో చక్కగా విధులు నిర్వహించారని తెలిపారు. క్లీన్ డ్రైవర్‌గా పేరు తెచ్చుకున్న ఆర్కే పాత్రో అందరికీ ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ ఉద్యోగులు, ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వి.రమేష్, జె.జగన్నాథం, ఐ.ఉమామహేశ్వరరావు, ఎం.వెంకటసూర్యనారాయణ, ఎస్.నాగరాజు, ఎంవి.సాగర్, ఎల్.దామోదరనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

సీతంపేట: మండలంలోని తల్లిపాల వారోత్సవాలు శుక్రవారం నుంచి ఈ నెల 7వ తేదీ వరకు జరగనున్నట్టు సీడీపీవో సిమ్మాలమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐసీడీఎస్ పరిధిలో లబ్ధిదారులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ కేంద్రం



తాత్కాలికంగా నిర్మించిన రేకుల షెడ్డు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని కేడీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో బిక్కుబిక్కుమని అంగన్‌వాడీ కార్యకలాపాలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో అంగన్‌వాడీ కార్యకర్త సొంతంగా తన డబ్బులతో ఆ అంగన్‌వాడీ కేంద్రం భవనం ముందు తాత్కాలికంగా రేకుల షెడ్డు నిర్మించి, విధులు నిర్వహిస్తున్నారు. కొత్త భవనం మంజూరయ్యేలా అధికారులు చొరవ తీసుకోవాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

గర్భిణులు ఆందోళన చెందాల్సిన పనిలేదు..

జియ్యమ్మవలస రూరల్: మండలంలోని చినమేరంగి గ్రామ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రసవానికి చేరే గర్భిణులు ఆందోళన చెందాల్సిన పనిలేదని వైద్యురాలు పూర్ణచంద్రిక అన్నారు. పురిటినొప్పులతో ఆస్పత్రిలో చేరిన చినమేరంగి గ్రామానికి చెందిన గర్భిణి బి.హేమలతకు ఆపరేషన్ చేసి గురువారం డెలివరీ చేశారు. ఇదే ఆస్పత్రిలో ఇదివరకు సాధారణ ప్రసవాలు జరిగేవని, ఇప్పటి నుంచి శస్త్రచికిత్స కూడా చేయడం జరుగుతుందన్నారు.

గెడ్డలుప్పిలో ఆరోగ్య పరీక్షలు

సీతానగరం: గెడ్డలుప్పిలో జ్వరాలు ప్రబలినట్టు ఉన్న సమాచారం మేరకు గ్రామంలోని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, రామమందిరం వద్ద పలువురికి గురువారం ఆరోగ్య పరీక్షలు వైద్య సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మాట్లాడుతూ పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.ఉషారాణి ఆధ్వర్యంలో గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ యు.సత్యనారాయణ, ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ముడుపుల పూజలు

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖీ నది ఒడ్డున వేంచేసిన లక్ష్మీనృసింహ స్వామికి భక్తులు గురువారం ముడుపుల పూజలు నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను నిర్వాహకులు అందజేశారు. భక్తులకు ఇబ్బందులు ఎదురవకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

రైతులకు సహకారం అందిస్తాం..


సీతానగరం: గుచ్చిమి పీఏసీఎస్ ద్వారా రైతులకు, వాణిజ్య వేత్తలకు తమవంతు సహకారాన్ని అందిస్తామని పీఏసీఎస్ చైర్మన్ బూరాడ చిరంజీవి అన్నారు. మండలంలోని గుచ్చిమి పీఏసీఎస్ చైర్మన్, ఇద్దరు డైరెక్టర్లుగా గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ మేరకు చిరంజీవి మాట్లాడుతూ ఎమ్మెల్యే బి.విజయచంద్ర నాయకత్వంలో పార్టీ కోసం సేవలందించిన వారికి గుర్తింపు వస్తుందన్నారు. గుచ్చిమి పీఏసీఎస్ ద్వారా గుచ్చిమి, సీతారాంపురం, జోగింపేట గ్రామాల వర్తకులకు, రైతులకు సేవలందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈవోలు పాల్గొన్నారు.

'ఆశ' సమస్యల పరిష్కార వేదిక

పార్వతీపురంటౌన్: ఆశ వర్కర్ల సమస్యల పరిష్కార వేదికను జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కేంద్రంలో ఎన్జీఓ హోంలో గురువారం నిర్వహించిన ఆశా గ్రీవెన్స్‌కు ప్రతీ పీహెచ్‌సీ నుంచి ఒక ఆశా కార్యకర్త ప్రతినిధిగా హాజరయ్యారు. వారి సమస్యలను గ్రీవెన్స్‌లో ప్రస్తావించి ఫిర్యాదులను డీఎంహెచ్‌వోకు అందజేశారు. వీటిలో ప్రధానంగా వారి విధి విధానాలకు సంబంధించి ఆశ జాబ్ చార్ట్ మేరకు విధులు అమలయ్యేలా ఉండాలని నివేదించారు. గ్రీవెన్స్‌లో అందజేసిన ఫిర్యాదులను పరిశీలించి తగు పరిష్కారం చూపుతామని డీఎంహెచ్‌వో వారికి తెలియజేశారు.

సీతాఫలం.. పోషకాలు పుష్కలం!

- తియ్యతియ్యని సీతాఫలంలో పోషక విలువలెన్నో..
- ఔషధ గుణాలు కలిగి ఉండడంతో కొనుగోళ్లకు ఆసక్తి
- ఏజెన్సీలో విరివిగా లభ్యం



100 గ్రాముల సీతాఫలం గుజ్జులో లభించేవి..

కేలరీలు	94 గ్రాములు
పిండిపదార్థాలు	20-25 గ్రాములు
ప్రోటీన్లు	2.5 గ్రాములు
పీచుపదార్థం	4.4 గ్రాములు
మాంసపుకృత్తులు	0.8-1.5 గ్రాములు
గ్లూకోజ్	20-22 గ్రాములు
కొవ్వుపదార్థాలు	0.30 గ్రాములు
కాల్షియం	0.02 గ్రాములు
భాస్వరం	0.04 గ్రాములు
ఇనుము	1 గ్రాము
లవణాలు	0.70 గ్రాములు
శక్తి(కేలరీల్లో)	1.50
ద్రవం	0.73 గ్రాములు

గుమ్మలక్ష్మీపురం: సీతాఫలం అంటే తెలియనివారుండరు. తియ్యతియ్యని ఈ ఫలాన్ని తినేందుకు చిన్నవాళ్ల దగ్గర నుంచి పెద్దవాళ్ల దాకా అందరూ ఇష్టపడుతుంటారు. అపారమైన పోషక విలువలు, ఔషధ గుణాలు కలిగిన ఈ ఫలం ఏజెన్సీలో విరివిగా లభిస్తుంటుంది. ప్రస్తుతం సీతాఫలాల సీజన్ ప్రారంభమైంది. పోషకాలు గనిగా..అమృత ఫలంగా పేరొందిన ఈ పండును సుగర్ ఆపిల్, కస్టర్డ్ యాపిల్ అనే పేర్లతో కూడా పిలుస్తుంటారు. పండు మాత్రమే కాకుండా ఈ చెట్టు ఆకులు, బెరడు కూడా ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ తదితర ఏజెన్సీల్లో జూలై, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో దొరికే ఈ పండ్లను గిరిజనుల నుంచి వ్యాపారులు సేకరించి, విక్రయిస్తుంటారు. వీటిని కొనుగోలు చేసేందుకు ప్రజలు కూడా పోటీపడుతుంటారు.

–రోగ నిరోధక శక్తి మెండు..

సీతాఫలంలో అనేక రకాల పోషకాలతో పాటు విటమిన్లు కూడా అధికంగా ఉంటాయి. ఈ పండు తింటే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. విటమిన్ ఎ, విటమిన్ బి, మెగ్నిషియం, పొటాషియం, ఫైబర్, ఐరన్ లాంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఉదయాన్నే దీన్ని తినడం ద్వారా కండరాలు, నరాల బలహీనత వంటి రుగ్మతలు తొలగిపోతాయి. శరీరానికి కావాల్సినంత శక్తి సైతం లభిస్తుంది. విటమిన్ ఎ ఎక్కువగా ఉండడంతో కంటి సమస్యలు దూరమవుతాయి. మెగ్నీషియం, పొటాషియం, సోడియం సమపాళ్లలో ఉండడం వల్ల రక్తపోటును అదుపు చేసి గుండె సమస్యలు తలెత్తకుండా చూస్తుంది. అలాగే శరీరంలో పేరుకుపోయిన అధిక కొవ్వును కూడా కరిగిస్తుంది. అల్సర్, గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలు లేకుండా చూస్తుంది. గర్భిణులు తినడం వల్ల పుట్టబోయే బిడ్డ మెదడు చురుగ్గా పనిచేస్తుంది. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధి రాకుండా తోడ్పడుతుందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

చిన్నారులకు ఎంతో మేలు..

బలహీనంగా ఉండే చిన్నపిల్లలకు సీతాఫలాలు ఎంత ఎక్కువగా తినిపిస్తే అంత మేలని వైద్యులు చెబుతున్నారు. ఈ పండ్లను ఎక్కువగా తినడం వల్ల రక్తహీనత తగ్గుతుంది. కడుపులో మంట, జీర్ణ సంబంధిత సమస్యల నుంచి దూరం కావడానికి ఈ పండ్లను ఎక్కువగా తినడం మంచిది. డైటింగ్ చేసే వారు ఈ పండ్లను క్రమం తప్పకుండా తీసుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. బాలింతలకు ఇది చక్కని పోషకాలు అందిస్తుంది. ఎదుగుతున్న పిల్లలు నిత్యం తింటుంటే కాల్షియం లాంటి పోషకాలు లభిస్తాయి. దీంతో ఎముకలు దృఢంగా మారుతాయి. శరీరంలోని వ్యర్థాలు బయటకు పంపడంలోనూ ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది. రక్తం శుద్ధి కూడా అవుతుంది.

–బెరడు, ఆకులు కూడా ఉపయోగమే..

ఒక్క పండే కాదు ఈ చెట్టు బెరడు, ఆకులు కూడా ఉపయోగపడతాయి. ఆకుల్లోని హైడ్రోక్లోరిక్ ఆమ్లం చర్మ సంబంధిత సమస్యలను తగ్గిస్తుంది. ఆకులను మెత్తగా నూరి రాస్తే చర్మ వ్యాధులు తగ్గుతాయి. మెత్తగా నూరిన ఆకులకు బోరిక్ పౌడర్ కలిపి మంచం, కుర్చీల మూలల్లో ఉంచితే నల్లుల బెడద కూడా ఉండదు. బెరడును కాల్చగా వచ్చిన కషాయాన్ని అధిక విరేచనాలతో బాధపడేవారికి ఔషధంగా ఇస్తుంటారు. సీతాఫలం గింజలను పొడిచేసి తలకు రాసుకుంటే పేలు సమస్య ఉండదు. అయితే ఇది కళ్లల్లో పడకుండా చూసుకోవాలి. గర్భిణులు ఈ పండును తక్కువగా తినాలి. పొరపాటున గింజలు లోపలికి వెళ్తే గర్భస్రావమయ్యే ప్రమాదం ఉంది. మధుమేహ వ్యాధిగ్రస్తులు, ఊబకాయులు ఈ పండ్లను వైద్యుల సలహాలతో తీసుకోవాలి. జలుబు, దగ్గు, ఆయాసం, ఎలర్జీ సమస్యలతో బాధపడేవారు పరిమితంగా తీసుకోవడం మంచిది. ఈ ఫలాన్ని రసం రూపంలో కాకుండా నేరుగా తినడమే ఉత్తమం. ఎందుకంటే గుజ్జు నోటిలోపల జీర్ణరసాలను పెంచుతుంది. తద్వారా జీర్ణక్రియ వేగవంతమవుతుంది. పండు గుజ్జును రసంలా చేసి దానికి పాలు కలిపి తాగితే సత్వర శక్తి లభిస్తుంది. ఇంకా కెరోటిన్, థయామిన్, రైబోఫ్లెవిన్, విటమిన్ సి సమృద్ధిగా లభిస్తాయి.

శివారు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



వసతిగృహం వద్ద పరిసరాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ తదితరులు

పాలకొండ రూరల్: అసాంఘిక కార్యకలాపాలకు, ఆకతాయిలకు అడ్డాలుగా మారుతున్న పట్టణ పరిధిలో శివారు ప్రాంతాల్లో నిఘా కొనసాగుతుందని పాలకొండ సీఐ మీసాల చంద్రమౌళి స్పష్టం చేశారు. స్థానిక శ్రీకాకుళం ప్రధాన రహదారిలో గల ఆర్టీసీ డిపో వెనుక గల ప్రాంగణం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, అక్కడికి సమీపంలో గల బాలికల వసతి గృహ పరిసరాలను గురువారం క్షుణ్ణంగా పరిశీలించారు. వసతిగృహ సిబ్బందితో మాట్లాడారు. బాలికల బంధువులు మినహా ఇతరులు వసతిగృహంలోకి ప్రవేశించకుండా చూడాలన్నారు. వచ్చిపోయే కుటుంబీకుల సమాచారం తప్పక నమోదు చేయాలన్నారు. అనుమానితులు, ఆకతాయిలను గుర్తిస్తే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. తల్లిదండ్రుల కష్టం గుర్తించి ఉన్నత చదువులు పూర్తి చేయాలని విద్యార్థినిలకు సూచించారు. సమస్యలు ఎదురైతే ధైర్యంగా వ్యవహరించాలన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ కె.ప్రయోగమూర్తి, సిబ్బంది ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ నారాయణరావు

గుమ్మలక్ష్మీపురం: యువత, విద్యార్థులంతా మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, వాటికి బానిసలై జీవితం నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ పి.నారాయణరావు సూచించారు. కురుపాం మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాలు(మాదక ద్రవ్యాలు) వల్ల కలిగే అనర్థాలపై గురువారం అవగాహన కల్పించారు. ఎంతోమంది గంజాయి, కొకైన్, ఖైనీ, గుట్కా, సిగరెట్, మద్యం వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడి చనిపోతున్నారని, వారి కుటుంబాల్లో విషాదం మిగుల్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి నడవడిక, జీవనం సాగించి, మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు.

గంజాయి బ్యాచ్‌లపై ఉక్కుపాదం



నిర్మానుష్య ప్రాంతాలను పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐ తదితరులు

వీరఘట్టం: గంజాయి బ్యాచ్‌లపై ఉక్కుపాదం తప్పదని పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి అన్నారు. వీరఘట్టం పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ జి.కళాధర్ ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించారు. వీరఘట్టం పట్టణ ప్రాంతంలో నిర్మానుష్యంగా ఉండే ప్రాంతాలలో కొందరు యువత గంజాయి సేవిస్తున్నట్టు వచ్చిన సమాచారంతో పోలీస్ సిబ్బందితో కలిసి తనిఖీలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం పక్కన నిర్మాణంలో ఉన్న పలు భవనాలతో పాటు పాత తహసీల్దార్ కార్యాలయం సమీపంలో కూడా తనిఖీలు చేశారు.

పంచాయతీ ఖర్చులపై ఆడిట్



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆడిట్ అధికారులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని 27 పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జరిగిన ఖర్చులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఆడిట్ జరిగింది. ఆడిట్ అధికారులు ప్రసాద్ రెడ్డి, జె.సందీప్‌లు పంచాయతీల వారీగా సంబంధిత దస్త్రాలను తెప్పించుకుని ఆడిట్ చేపట్టారు. జనరల్ ఫండ్స్, 15వ ఆర్థిక సంఘం ద్వారా వచ్చిన నిధులతో ఏడాది కాలంలో చేపట్టిన ఖర్చులకు సంబంధించి, ఎంబుక్ నమోదులు, తగిన డాక్యుమెంట్లను పంచాయతీ కార్యదర్శుల నుంచి తీసుకుని తనిఖీ చేశారు.

భక్తిశ్రద్ధలతో జైగురుదత్త హోమం



హోమం చేస్తున్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని శ్రీషిర్డీసాయిబాబా మందిరంలో జైగురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ తదితర పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ ప్రాంగణంలో వీరఘట్టం ప్రాంతానికి చెందిన ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ పర్యవేక్షణలో ప్రతి గురువారం ఈ గురుదత్త హోమంను ఆలయ అర్చకులు శ్రీనివాసరావు భక్తులతో నిర్వహించారు. అనంతరం దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

7న అన్నదాన సత్రం ప్రారంభం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, శ్రీకోదండరామస్వామి ఆలయాల్లో కొత్తగా నిర్మించిన వానప్రస్థాశమం, అన్నదాన సత్రం, గోవింద గోశాలలను ఈ నెల 7వ తేదీన ప్రారంభిస్తున్నట్లు టీటీడీ సేవా ట్రస్టు సభ్యులు ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, గిరిజన సంక్షేమ శాఖామంత్రి సంధ్యారాణి, దేవాదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి తదితరులు హాజరుకానున్నారని పేర్కొన్నారు.

సవరభాష ప్రచారకుడు మృతి

గుమ్మలక్ష్మీపురం: సవర భాష ప్రచారకుడు బిడ్డిక గోపాల్(70) మృతి చెందారు. గత కొన్నాళ్లుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన..చికిత్స నిమిత్తం పార్వతీపురం ఏరియా ఆస్పత్రిలో చేరారు. గురువారం చికిత్స పొందుతూ ఆయన మరణించారు. మండలంలోని కేడీ కాలనీకి చెందిన ఈయన కన్నయ్యగూడలో అక్షరబ్రహ్మ ఆలయానికి పూజారిగా ఉంటూనే అదే గ్రామంలో సవరభాష ప్రచార పాఠశాలను నెలకొల్పి సవర భాషాభివృద్ధికి కృషి చేశారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, సీతంపేట తదితర ప్రాంతాలతో పాటు ఒడిశాలోని పలు ప్రాంతాల్లో సవరభాష, లిపిపై కూడా ప్రచారం చేశారు. ఆయన మృతి పట్ల చెముడుగూడ ఎంపీటీసీ సభ్యుడు మండంగి రమణ, ఆదివాసీ నాయకులు బిడ్డిక సొంబర, టి.కృష్ణారావు తదితరులు ప్రగాఢ సంతాపం ప్రకటించారు.

సన్మానం



సత్యనారాయణనాయుడు దంపతులను సత్కరిస్తున్న సర్పంచ్ శిరీష తదితరులు

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన ఉపాధ్యాయుడు ఎం.సత్యనారాయణనాయుడును గురువారం సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కేతిరెడ్డి అచ్యుతరావు, సర్పంచ్ కె.శిరీషలు సత్యనారాయణనాయుడు దంపతులను దుశ్శాలువా, ప్రశంసాపత్రాలతో సత్కరించారు. అనంతరం ఆయన సేవలను వక్తలు ప్రశంసించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ కె.చంద్రశేఖరరావు, మాజీ సర్పంచ్ కె.కూర్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ షాపులో ఆకస్మిక తనిఖీలు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని మెడికల్ షాపులు, ప్రైవేటు క్లినిక్‌లలో స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు ఎస్ఎంకే తిరుమలప్రసాద్ గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. కలెక్టరు శ్యామ్‌ప్రసాద్, డీఎంహెచ్‌వో ఎస్.భాస్కరరావు ఆదేశాల మేరకు జరిగిన ఈ తనిఖీల్లో షాపులు, క్లినిక్‌ల అనుమతి పత్రాలు పరిశీలించి, పలు సూచనలు చేశారు. లైసెన్స్ కలిగిన క్లినిక్‌లలో మాత్రమే ప్రాథమిక చికిత్స చేయించుకోవాలని తెలిపారు.



మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న వైద్యుడు తిరుమలప్రసాద్

సాగునీటి కోసం అవస్థలు

పాలకొండ రూరల్: ఖరీఫ్ సేద్యానికి సంబంధించి తోటపల్లి ప్రాజెక్టు నుంచి సాగు నీరు విడుదల చేసినా పాలకొండ మండల పరిధిలో శివారు ప్రాంతాలకు ఆ నీరు చేరలేదు. దీంతో వర్షాధారంగా సేద్యం చేపట్టిన రైతులు అవస్థలు పడుతున్నట్టు అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు పేర్కొన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. వరుణుడు కినుకు వహించటంతో ఇప్పటికే వర్షాధారితంగా వేసిన నాట్లు ప్రస్తుతం భానుడి ప్రతాపానికి ఎండి పోతున్నట్లు వాపోయారు. వెలగవాడ, రుద్రిపేటతో పాటు శివారు ప్రాంత రైతులు ఇంజిన్ల సాయంతో సాగుకు నీటి తడులు అందిస్తున్నారన్నారు.

సమస్యలు గుర్తించి తక్షణమే నియోకవర్గ ప్రజా ప్రతినిధులు, సబ్ కలెక్టర్‌తో పాటు, జలవనరుల శాఖ అధికారులు స్పందించాలన్నారు. ప్రభుత్వం చొరవ తీసుకోకుంటే వందలాది ఎకరాల్లో పంట నష్టం తప్పదన్నారు.

సమష్టిగా కూటమి తీరు ఎండగడదాం



మాజీ ఎమ్మెల్యే కళావతిని కలిసిన ఉమ్మడి శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్ వీరరెడ్డి

పాలకొండ రూరల్: ప్రజల పక్షాన నిలిచేందుకు వైఎస్సార్ సీపీ అధినేత ఆదేశాలతో గ్రామ స్థాయిలో పార్టీ అనుబంధ విభాగాలను ఏర్పాటుచేయటం జరిగిందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నాయకురాలు విశ్వాసరాయి కళావతి అన్నారు. సమష్టిగా కూటమి ప్రభుత్వ తీరును ప్రజల మధ్యనే ఎండగడదామని స్పష్టం చేశారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసిన ఆ పార్టీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ, ఉమ్మడి శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల అనుబంధ విభాగాల ఇన్‌చార్జ్ వీరరెడ్డితో ఆమె చర్చించారు. ఇదివరకే జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి విభాగాల నియామకం పూర్తి చేసినట్టు తెలిపారు. త్వరలో గ్రామ, నగర పంచాయతీ పరిధి వార్డు కమిటీల సిద్ధం చేయనున్నట్టు పేర్కొన్నారు. వీరంతా కూటమి అనుసరిస్తున్న రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు గత ప్రభుత్వంలో జగనన్న అమలు చేసిన చూపిన సంక్షేమ తీరును విడమర్చి చెప్పనున్నారన్నారు. ఈ క్రమంలో రానున్న రోజుల్లో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు వేయనున్న పెద్దపీట, ప్రాధానత్యను గూర్చి చర్చించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



ప్రధానోపాధ్యాయులకు సూచనలిస్తున్న ఏటీడబ్ల్యూవో రజని

గుమ్మలక్ష్మీపురం: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారి మెరుగైన ఆరోగ్యంపై కూడా శ్రద్ధ వహించాలని మండల సహాయ గిరిజన సంక్షేమ అధికారిణి ఎల్.రజని సూచించారు. ఏటీడబ్ల్యూవోగా ఆమె ఇటీవల బాధ్యతలు స్వీకరించగా గురువారం తన కార్యాలయంలో గుమ్మలక్ష్మీపురం, కొమరాడ మండలాలకు చెందిన ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశమయ్యారు. పాఠశాలల వారీగా విద్యార్థులు, పాఠశాలల స్థితిగతులపై ఆరా తీశారు. విద్యార్థులు అనారోగ్యం బారినపడకుండా చర్యలు తీసుకోవాలని, ఎవరైనా జ్వరంతో బాధపడినా మరే ఇతర సమస్యలతో బాధపడుతున్నా వెంటనే సమీపంలోని ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లి చికిత్స అందివ్వాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సీతంపేట: మండలంలోని శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఈఈ విష్ణుమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మెయింటెనెన్స్ పనులు చేయనుండడంతో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాలికల సామర్థ్యాల లెక్కింపు



రేగులపాడు కేజీబీవీలో సామర్థ్యాలపై పరీక్ష రాస్తున్న బాలికలు

వీరఘట్టం: బాలికల్లో దాగి ఉన్న సామర్థ్యాలను లెక్కించేందుకే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారి సామర్థ్యాలపై పరీక్షలు నిర్వహిస్తున్నట్టు ఎంఈవో ఆర్.ఆనందరావు తెలిపారు. మండలంలోని రేగులపాడు కేజీబీవీలో 6, 7 తరగతులకు, 8, 9 తరగతుల బాలికలకు వారి సామర్థ్యాలపై గురువారం పరీక్షలు నిర్వహించామని పేర్కొన్నారు. ఎస్‌వో ఉషారత్నకుమారి, సీఆర్‌టీలు ఈ పరీక్షను పర్యవేక్షించారు.

పేదలకు అండగా సీపీఐ

భామిని: పేద, బడుగు, బలహీన వర్గాలకు అండగా నిలిచి పోరాటాలు చేస్తున్న వందేళ్ల సీపీఐ మహా సభలకు తరలిరావాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, డీహెచ్‌పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జి జనార్ధనరావు గురువారం పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఆగస్టు 8, 9 తేదీలలో పాలకొండలో జరిగే జిల్లా మహాసభలకు విజయవంతం చేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను ఖండించాలన్నారు. ప్రజలపై భారం మోపే స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలన్నారు. ఆ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దోమల నివారణకు విస్తృత చర్యలు



డ్రోన్ ద్వారా ద్రావణం పిచికారీని పరిశీలిస్తున్న పీవో

సీతంపేట: దోమల నివారణ చర్యలు విస్తృతంగా చేపట్టాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. మండలంలోని పెద్దూరు, నౌగూడ గ్రామాల పరిధిలో ఉన్న చెరువుల్లో దోమల లార్వాను నివారించే ఫ్లోరో బెంజీరాన్ ద్రావణాన్ని మలేరియా నివారణ శాఖ ఆధ్వర్యంలో పిచికారీ చేశారు. డ్రోన్ ద్వారా చెరువుల్లో పిచికారీ చేయించడాన్ని పీవో పరిశీలించారు. దోమల నివారణ చర్యలపై పూర్తి స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీఎంవో పీవీ సత్యనారాయణ, డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ మోహన్‌రావు, కన్సల్టెంట్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

20 మందిపై బైండోవర్ కేసులు



బైండోవర్ చేసిన వారిని తహసీల్దార్ ఎదుట హాజరుపర్చిన ఎస్‌ఐ

సీతంపేట: మండలంలోని సారా విక్రయించిన వారు, అక్రమ రవాణాకు పాల్పడిన వ్యక్తులు, వండిన వారు మొత్తం 20 మందిపై గురువారం బైండోవర్ కేసులు పెట్టినట్టు ఎస్‌ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. వీరిని తహసీల్దార్ ఎదుట గురువారం హాజరు పర్చినట్టు తెలిపారు. మళ్లీ సారాకు సంబంధించిన కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు.